చవితి పండుగకు సిద్ధమవుతున్న పార్వతీనందనుడు

- రకరకాలుగా విగ్రహాలు తయారు
- గుజరాత్, రాజస్థాన్ నుంచి కార్మికులు రాక
- 4 నుంచి 12 అడుగుల వరకు విగ్రహాలు తయారు
- రూ. 9 వేల నుంచి రూ.45 వేల వరకు ధరలు



విక్రయానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు



రంగులు వేస్తున్న విక్రయదారుడు

పొన్నూరు: పొన్నూరులో వినాయక చవితి సందడి మొదలైంది. ఈ నెల 27న చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని గణనాథుని విగ్రహాలు ముస్తాబవుతున్నాయి. గుజరాత్, రాజస్థాన్ తదితర ప్రాంతాలకు చెందిన కార్మికులు వినాయక విగ్రహాలను తయారు చేసి రంగులతో తీర్చిదిద్దుతున్నారు. మహాగణపతి ఉత్సవాల నేపథ్యంలో మండపాలను ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండపాల్లో భారీ వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే విక్రయ కేంద్రాల్లో కొనుగోలుదారుల సందడి నెలకొంది. ఎంపిక చేసుకున్న భారీ ప్రతిమలకు అడ్వాన్సులు ఇస్తున్నారు. విక్రయదారులు విగ్రహాలను వివిధ రంగులతో అందంగా తీర్చిదిద్దుతున్నారు. యువత వినాయక చవితి ఉత్సవాలపై ఎక్కువ ఉత్సాహం చూపుతుండటంతో పట్టణంతో పాటు ప్రతి గ్రామంలో భారీ విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో డిమాండ్ పెరిగి పని త్వరగా పూర్తయ్యే ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాలకు ప్రాధాన్యతనిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో 4 నుంచి 12 అడుగుల వరకు విగ్రహాలు తయారు చేస్తున్నారు. వీటి ధర రూ. 9 వేల నుంచి రూ.45 వేల వరకు ఉన్నాయి. పొన్నూరు పరిధిలో కట్టెంపూడి, చింతలపూడి ప్రధాన రహదారుల్లో గుడారాల్లో ఉన్న వినాయక విగ్రహాల విక్రయాలు ఊపందుకున్నాయి.

6 నెలల నుంచే విగ్రహాలు తయారు



ప్రతి వినాయక చవితికి 130 నుండి 140 విగ్రహాలు విక్రయిస్తాను. ఒక్కో భారీ ప్రతిమను కూడా ఒక్క రోజులోనే తయారు చేస్తాం. 9 నుంచి 12 అడుగుల విగ్రహాలు తయారు చేసి రూ. 9 నుంచి 45 వేల వరకు విక్రయిస్తాం. ప్రత్యేకంగా రాజస్థాన్, గుజరాత్ నుంచి కార్మికులు వచ్చి విగ్రహాలు తయారు చేస్తారు. పండుగకు 6 నెలల నుంచే విగ్రహాల తయారీని చేపడతాం.

–పటేల్ బాబు, విక్రయదారుడు, గుజరాత్

అబద్ధాలకు కేరాఫ్ చంద్రబాబు

- వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి (ఏఎస్ఆర్), ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి
- జొన్నలగడ్డ, తోకావారిపాలెం గ్రామాల్లో బాబుష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం

గుంటూరు రూరల్: అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆళ్ళ శ్రీనివాసరెడ్డి (ఏఎస్ఆర్), ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డిలు తెలిపారు. శుక్రవారం ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇంచార్జ్ బలసాని కిరణ్‌కుమార్ ఆదేశాల మేరకు మండల కన్వీనర్ ఆధ్వర్యంలో రూరల్ మండలంలోని జొన్నలగడ్డ, తోకావారిపాలెం గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వైఎస్సార్ సీపీ నేతలు మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల సమయంలో ఎలాగైనా గద్దెనెక్కాలని 600 హామీలను ఇచ్చి ప్రజలను నేడు నట్టేట ముంచాడన్నారు. చంద్రబాబు తమ సామాజిక వర్గాన్ని అభివృద్ధి చేసుకునేందుకు పేద ప్రజలను అణగదొక్కుతూనే ఉంటాడన్నారు. పేదల మనిషి జగనన్న మాత్రం చెప్పాడంటే చేస్తాడంతే అన్నట్లు ఎన్నికల హామీలను నూరుశాతం అమలు చేసిన దేశంలోనే ఏకైక నాయకుడు మన జగనన్న మాత్రమేనని తెలిపారు. అబద్ధాలకు పేటెంట్ చంద్రబాబు పొందాడని ఎన్నికలు రాగానే ఆయన అబద్ధాలను వందల సంఖ్యలో రాసుకుని ప్రజలపై ప్రయోగించి మోసం చేసి గెలుస్తాడన్నారు. చంద్రబాబు అంటేనే అబద్ధాలని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా ఆడబిడ్డలకు ఇవ్వాల్సిన నెలకు రూ.1500 కోసం ఆంధ్రాను అమ్మాలని నేడు టీడీపీ నేతలు అంటున్నారని తెలిపారు. అదేవిధంగా నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వకుండా మోసం చేశాడని గుర్తు చేశారు. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికి రూ 15000 ఇస్తానని చెప్పి మోసం చేశాడన్నారు. చంద్రబాబు మోసాలను గ్రామ స్థాయిలో ప్రజలకు చేరవేసేందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు సైనికుల్లా కృషి చేయాలన్నారు. చంద్రబాబు మోసపు మాటలు నమ్మి ప్రజలు మోసపోయారని, పేదలను నేడు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి ఇంటికీ చంద్రబాబు చేసిన మోసాన్ని తెలియజేయాలని చెప్పారు. చంద్రబాబుని నమ్మితే నట్టేట మునిగినట్టేనని మరోసారి రుజువైందని తెలిపారు. చంద్రబాబును ప్రతి పదేళ్ళకోసారి నమ్మి ప్రజలు మోసపోతున్నారన్నారు. అబద్ధాలను చెప్పి మోసం చేయటంలో చంద్రబాబు ఘనుడని తెలిపారు. ప్రతి ఐదేళ్ళకు ఒకసారి ఏదోక పార్టీతో జతకట్టి ప్రజలను మోసం చేస్తూనే ఉన్నాడని తెలిపారు. అనంతరం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ పోస్టర్ ఇంటింటికీ తిరిగి ప్రజలకు అందజేసి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు మండేపూడి పురుషోత్తం, మెట్టు వెంకటప్పారెడ్డి, దుగ్గెంపూడి యోగేశ్వర్‌రెడ్డి, వంగా సీతారామిరెడ్డి, కొండా కోటిరెడ్డి, వింతా సుబ్బారెడ్డి, నాలాది శ్రీనివాస్, గూడూరి రాజు, తోకావారిపాలెం సర్పంచ్ సామ్రాజ్యం, రాంజీ అంబేద్కర్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల నాయకులు, రాష్ట్ర నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కరపత్రాలను ప్రదర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

క్లుప్తంగా

ఆర్‌వీఆర్‌జేసీలో ఉత్సాహంగా ఫేర్వెల్ డే



గుంటూరు రూరల్: విద్య పూర్తి చేసుకున్న విద్యార్థుల నూతన ప్రయాణం, వారి ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలకాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఇంజనీరింగ్ పూర్తి చేసుకుని వెళుతున్న విద్యార్థులకు కళాశాలలోని జూనియర్ విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని వివిధ విభాగాల విద్యార్థులు వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో ఉపాధ్యాయులను సన్మానించుకున్నారు. వారి విద్యాభ్యాసం సమయంలో జరిగిన వివిధ విశేష అనుభూతులను గుర్తు చేసుకుంటూ, ఉత్సాహంగా గీతాలాపన, నృత్యం తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులు పూర్తి చేసుకున్న ఇంజనీరింగ్ కోర్స్ ఒక మైలురాయిని దాటుకొని, నూతన ప్రపంచంలో అడుగు పెడుతూ చేస్తున్న నూతన ప్రయాణం ఉన్నత శిఖరాలకు చేరాలని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ విలువైన కళాశాల విద్యా సమయం జీవితంలో మధుర జ్ఞాపకాలను నింపే విధంగా ఉండి, భవిష్యత్ తరాలకు మార్గ దర్శకులుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, వివిధ శాఖల విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీపై దాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



గుంటూరు రూరల్: ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి కేవలం కుట్ర, కక్ష, రెడ్ బుక్ రాజ్యాంగాన్ని నడుపుతున్న కూటమి ప్రభుత్వ నిరంకుశత్వానికి నిరసనగా శుక్రవారం వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం ప్రత్తిపాడు నియోజకవర్గం అధ్యక్షుడు దారం అశోక్ కుమార్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రత్తిపాడు గ్రామంలోని మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పించి అక్కడి నుంచి శాంతియుతంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేతలు మాట్లాడుతూ పులివెందులలో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై తెలుగుదేశంపార్టీ గుండాల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ, దాడులకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేవలం కక్షపూరితంగా ఫ్యాక్షన్ రాజకీయాలకు తెరలేపి ప్రశాతంగా జీవిస్తున్న ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే విధంగా ఇటువంటి దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు మండల పార్టీ అధ్యక్షుడు చల్లా హనుమంత్ యాదవ్, గండు నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పరమారెడ్డి, మూలె శ్రీనివాస రెడ్డి, ఫ్రాన్సిస్, చెంచు రామారావు, సుబ్బారెడ్డి, వేలూరి లక్ష్మారెడ్డి, చాపర్తి లక్ష్మణ్, వేములూరి లక్ష్మణరావు, ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ ఎంఎస్ స్వామినాథన్ గొప్ప శాస్త్రవేత్త



లక్ష్మీపురం: ప్రొఫెసర్ ఎంఎస్ స్వామినాథన్ గొప్ప శాస్త్రవేత్త అని, భారత ముద్దు బిడ్డ అని ప్రజలకు సేవ చేయటానికి స్వామినాథన్ సైన్స్‌ను ఒక సాధనంగా ఉపయోగించారని సీనియర్ ఇంజినీర్ ఎస్.సదాశివం పేర్కొన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శతజయంతి సభ శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశ భద్రతకు కీలకమైన వ్యవసాయరంగాన్ని ప్రభావితం చేసిన వారిలో ప్రొఫెసర్ స్వామినాథన్ ఒకరన్నారు. స్వామినాథన్‌ను హరిత విప్లవ పితామహుడిగా పేర్కొంటారని స్వామినాథన్ తన 98 ఏళ్ల జీవితంలో అనేక వైవిధ్యమైన విజయాలను అందుకున్నారన్నారు. విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య, సంస్థ కార్యదర్శి కొండాశి వరామిరెడ్డి మాట్లాడారు.

కష్టపడేతత్వం ఉంటే సివిల్ సర్వీసెస్ సాధ్యమే

యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ఆల్ ఇండియా ర్యాంకర్ శనగవరపు సాయి భార్గవ



మాట్లాడుతున్న శనగవరపు సాయి భార్గవ

చేబ్రోలు: సివిల్స్‌లో సత్తాచాటాలనుకునే విద్యార్థులకు దృఢ సంకల్పం, కష్టపడే తత్వం. సరైన గైడెన్స్ ఉంటే సర్వీస్ సులభంగా సాధించవచ్చునని యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ఆల్ ఇండియా ర్యాంకర్ శనగవరపు సాయి భార్గవ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో విద్యార్థులకు కాంపిటీటివ్ ఎగ్జామినేషన్స్ అనే అంశంపై ఓరియెంటేషన్ సెషన్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సివిల్ సర్వీసెస్ ఆల్ ఇండియా ర్యాంకర్, ఐఆర్ఎంస్ (ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీసెస్) శనగవరపు సాయి భార్గవ మాట్లాడుతూ ఏడాది పాటు చదివి పరీక్షలో విజయం సాధించకపోతే నిరాశ చెందకూడదని, ఓర్పు, సహనంతో మళ్లీ మళ్లీ ప్రయత్నించి సర్వీస్ సాధించాలన్నారు. పాత ప్రశ్నాపత్రాలను బాగా ప్రాక్టీస్ చేయడం వలన ప్రశ్నల సరళి ఏ విధంగా అడుగుతున్నారో అర్థమవుతుందన్నారు. ముఖ్యంగా ఎలా ప్రిపేర్ అవ్వాలో తెలియాలంటే మాత్రం నిపుణుల గైడెన్స్ తీసుకోవాలన్నారు. సివిల్స్ పరీక్షలో మెరవాలంటే శ్రమ, శ్రద్ధ, అంకితభావం, సొంత ప్రతిభతోనే రాణించగలరని పేర్కొన్నారు. సివిల్స్ ప్రిపేర్ అయ్యే విద్యార్థులు సబ్జెక్ట్‌ల విశ్లేషణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కరెంట్ అఫైర్స్, ప్రస్తుత పరిణామాలను ఎప్పటికప్పుడు వాటిపై పట్టు సాధిస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అడ్వైజర్, ఏపీ మాజీ డీజీపీ మాలకొండయ్య, ఆయా విభాగాల డీన్లు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెదకాకాని: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. గుంటూరు ఆటోనగర్ శివారులోని తక్కెళ్ళపాడు సమీపంలో జాతీయ రహదారి ప్రక్కనే ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో గుంటూరు అంబేద్కర్ నగర్‌కు చెందిన రచ్చకొండ బుల్లిబాబు గత కొంతకాలంగా పనిచేస్తున్నాడు. ఎప్పటి మాదిరిగానే శుక్రవారం తెల్లవారుజామున టీ తాగేందుకు రోడ్డు దాటుతున్నాడు. అదే క్రమంలో విజయవాడ వైపు నుండి గుంటూరు వైపు వెళుతున్న లారీ ఢీ కొంది. ఈ ఘటనలో బుల్లిబాబు (30) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహం లారీ చక్రాల కింద నలిగి ఛిద్రంగా మారింది. స్థానికులు సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ టిపి నారాయణస్వామి తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



పెదకాకాని వై జంక్షన్‌లో పూజలు అందుకుంటున్న వరలక్ష్మీ అమ్మవారు



పూజలో పాల్గొన్న మహిళలు

పొన్నూరు: శ్రావణ మాసం మూడో శుక్రవారం .. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం, కుంకుమ పూజా కార్యక్రమాలను ఆర్యవైశ్య మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. నీరాజన మంత్ర పుష్పం అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కారుమూరి ప్రకాష్, కోట హేమ సుందర గుప్తా, యామా రామమోహనరావు, కాంతారావు, వక్కలగడ్డ మోహనరావు, గుర్రం రమేష్, కొల్లిపర శ్రీనివాసరావు, కొమ్మూరి శ్రీనివాసరావు, అరవింద్, అవ్వారు వెంకటేశ్వరరావు, అమరా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెదకాకాని: శ్రావణమాసం వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. పెదకాకాని మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న దేవస్థానాల్లో భక్తుల సందడి చోటు చేసుకుంది. పెదకాకాని వై జంక్షన్‌లో ఉన్న శ్రీవరలక్ష్మీ అమ్మవారి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆయా గ్రామాలకు చెందిన భక్తులు ముఖ్యంగా మహిళలు చిన్నారులతో ఆలయానికి చేరుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అర్చకులు గోత్రనామ పూజలు జరిపించి అమ్మవారి ఆశీస్సులు అందజేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు ఏర్పాటు చేశారు. అలానే మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు అమ్మవారికి పూజా ద్రవ్యములు సమర్పించి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులు అరెస్టు



గంజాయి నిందితులతో ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులు

గుంటూరు రూరల్: జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ వి అరుణకుమారి ఆదేశాల మేరకు పీ అండ్ ఈఐ, ఈఎస్‌టీఎఫ్ గుంటూరు అధికారులకు గంజాయి విక్రయాలపై వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం దాడులు నిర్వహించారు. అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఇ మారయ్యబాబు నేతృత్వంలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ టాస్క్ ఫోర్సు ఇన్‌స్పెక్టర్ బి.నయనతార సిబ్బంది, ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ సిబ్బందితో కలిసి గంజాయి విక్రయించే వ్యక్తులపై దాడులు నిర్వహించారు. దాడుల్లో ప్రత్తిపాడు మండలం, తుమ్మలపాలెం గ్రామంలో ఓల్డ్ బేరింగ్ కంపెనీ వద్ద ఒడిస్సా రాష్ట్రానికి చెందిన దీపక్‌సెట్టి, మనుపబాస్‌బెహెర అనే ఇద్దరు వ్యక్తులు పార్వతీపురం, బోయపాలెం గ్రామంకు చెందిన జగన్‌కుమార్‌మాలిక్ భార్య లక్ష్మిలతామాలిక్‌లతో కలిసి ముగ్గురు గంజాయి విక్రయిస్తుండగా, రెడ్ హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నారు. వాళ్ళ ఒక్కొక్కరి వద్ద 500, 500–557 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురి వద్ద కలిపి 1557 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని వారిని అరెస్ట్ చేశారు. ఈసందర్భంగా ప్రొహిబిషన్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్సు ఇన్‌స్పెక్టర్ బి నయనతార మాట్లాడుతూ ఎవరైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలు కలిగి ఉన్నా, లేదా తాగుచున్న కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దాడులలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ టాస్క్ ఫోర్సు సబ్ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ, ప్రత్తిపాడు ఎస్ఐ రవీంద్రబాబు, ఈఎస్‌టీఎఫ్ సిబ్బంది యం.లక్ష్మి, వి.రమేష్, కె.నాంచారయ్య, యంనాగరాజు, చైతన్య, ప్రత్తిపాడు స్టేషన్ సిబ్బంది యన్ శ్రీనివాసబాబు, డి.స్వరాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు



వివరాలు తెలుపుతున్న సీఐ వీరానాయక్

పొన్నూరు: పట్టణంలోని ఓ పెయింట్ షాపులో చోరీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ వీరానాయక్ కేసు వివరాలు వెల్లడించారు. గత మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఐలాండ్ సెంటర్‌లోని దుర్గా పెయింట్స్ షాప్‌లో జరిగిన దొంగతనంలో కొంత నగదు అపహరణకు గురైంది. యజమాని షేక్. సాదిక్ భాషా ఫిర్యాదు మేరకు ఎస్ఐ. శ్రీ హరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. గురువారం ఉదయం గుంటూరు శారదాకాలనీకి చెందిన ముద్దాయి మిక్కిలి సందీప్‌ని పొన్నూరు మున్సిపల్ కార్యాలయం వద్ద అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అతని వద్ద ఉన్న రూ. 30 వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

- అతనిపై గతంలో 18 కేసులు వివిధ పోలీస్ స్టేషన్లో కేసులు నమోదై, తొమ్మిది సార్లు జైలుకు వెళ్లాడన్నారు. గత 10 రోజుల క్రితం ఒంగోలు రూరల్ పరిధిలో రెండు కేసుల్లో 60 వేల నగదు, ఒక స్కూటీ, పల్నాడు జిల్లా నకరికల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక దొంగతనం కేసులో రూ.15 వేలు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ. 1 లక్ష 5 వేలతో పాటు స్కూటీ స్వాధీనం చేసుకుని ముద్దాయిని రిమాండ్ కు పంపినట్లు సీఐ తెలిపారు. 36 గంటలలో చోరీ కేసును ఛేదించిన సీఐ వీరానాయక్, ఎస్ శ్రీహరిని ఉన్నతాధికారులు అభినందించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడంతో పాటు నిర్దేశిత గడువు మేరకు పూర్తి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అరండల్ పేట, వసంత రాయపురం, మల్లికార్జున పేట, శ్రీనగర్, అమరావతి రోడ్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ అధికారులు సమర్ధంగా పర్యవేక్షణ చేయాలని చెప్పారు. ప్రతి పని నిర్దేశిత గడువు మేరకు పూర్తి అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని, జాప్యం జరిగితే ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. ఏఈల వారీగా రోడ్లపై ప్యాచ్ వర్క్‌లను చేపట్టాలని, ప్రతి రోజు తాగునీటి సరఫరా జరిగే సమయంలో ఎమినిటీ కార్యదర్శులు తప్పనిసరిగా శ్యాంపిల్స్ తీసి ప్రత్యేకంగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని చెప్పారు. అనంతరం అమరావతి రోడ్‌లో ఆక్రమణలను గమనించి, శంకర్ విలాస్ వంతెన పనులతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్నందున రోడ్లు, డ్రెయిన్లపై ఆక్రమణల తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులకు సూచించారు.

• దారంతా గుంతలే!



పట్టణంలోని పలు రహదారులు గుంతలమయంగా మారాయి. చీరాల, బాపట్ల, రేపల్లె, గుంటూరుకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో వాహన రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. గుంతలతో ఉన్న రహదారుల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల రహదారుల అభివృద్ధి కొన్ని ప్రాంతాలకే పరిమితం చేసి మిగిలిన వాటిని పట్టించుకోలేదు. ప్రధానంగా శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయం వద్ద పెట్రోల్ బంకు సమీపంలో, ఆర్టీసీ డిపో, మున్సిపల్ కార్యాలయం సమీపంలోని రహదారులు గుంతలమయంగా మారి అధ్వాన్నంగా ఉన్నాయి. రోడ్ల మధ్యలో ఏర్పడిన గుంతల కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

–పొన్నూరు

• ఖాళీ స్థలాలు.. దోమలకు ఆవాసాలు



చిట్టడవులను తలపిస్తోన్న ఖాళీస్థలాలు, అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ వ్యవస్థ కారణంగా స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పట్టణంలోని వైష్ణవి నగర్లో ఖాళీ స్థలాల్లో పిచ్చి చెట్లు పెరిగి దోమలకు నిలయాలుగా మారాయి. పలు వీధుల్లో రోజువారీ కాలువల్లో పూడిక తీయకపోవడంతో మురుగు స్తంభించడంతో దుర్వాసన వెదజల్లుతోంది. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం, ఎవరి ఇళ్ల ముందు వారు ర్యాంపులతో డ్రెయిన్లను మూసివేయడంతో మురుగునీరు ముందుకు కదలడం లేదు. పారిశుద్ధ్య సిబ్బంది కనీసం పూడిక తీసేందుకు కూడా వీలులేకుండా డ్రెయిన్లను మూసివేసి కొందరు మొక్కల కుండీలు అడ్డుగా పెడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో మురుగునీరు ఖాళీ స్థలాల్లోకి చేరి పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో అవి చిట్టడవిని తలపిస్తున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

–పొన్నూరు

రోగులకు పండ్లు పంపిణీ



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ యశస్వి రమణ

గుంటూరు మెడికల్: పేషెంట్ డాక్టర్ ఇంటరాక్షన్ కార్యక్రమంలో భాగంగా 25వ శుక్రవారం మీ కోసం– మేం కార్యక్రమం గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవయవ దానంతో లాభాలు వివరించారు. జీజీహెచ్‌లో నూతన సెక్యూరిటీ పాలసీ ప్రకారం అటెండర్ పాస్ తప్పనిసరి, అవసరం మేరకు మాత్రమే రోగి బంధువులు ఆస్పత్రిలో ఉండాలన్నారు. మత్తు పానీయాలు తీసుకొని ఆస్పత్రి లోపలికి రావద్దని సూచించారు. నిర్దేశించిన ఆస్పత్రి నియమావళి గురించి ప్రజలకు అవగాహన కలిగించారు. జాగృతి సేవా సంస్థ నాగరాజకుమారి రోగులు, రోగుల సహాయకులకు ఉచితంగా పండ్లు పంపిణీ చేశారు.